ప్రజాశక్తి

శనివారం 11 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులను పరామర్శిస్తున్న వైద్యాధికారులు, సిపిఎం నాయకులు

అన్నపర్రు హాస్టల్లో కలుషితాహారం

- 56 మంది విద్యార్థులకు అస్వస్థత - జిజిహెచ్‌కు 18 మంది తరలింపు
- మిగతావారికి పెదనందిపాడులో ప్రత్యేక శిబిరంలో వైద్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/పెదనందిపాడు

పెదనందిపాడు మండలం అన్నపర్రు బిసి బాలుర హాస్టల్‌లో ఆహార పానియాల కలుషితం కలకలం రేపింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 108 విద్యార్థులుంటున్న ఈ హాస్టల్‌లో అరకొర సౌకర్యాలే ఉన్నాయి. ఏదైనా ఉపద్రవం సంభవిస్తే మినహా మిగతా రోజుల్లో హాస్టళ్లను పట్టించుకునే వారే కరువయ్యారు. హాస్టల్లో గురువారం రాత్రి భోజనంలో బెండకాయ ఫ్రై, మజ్జిగ, శు

హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



క్రవారం ఉదయం అన్నంతో టమాట పచ్చడి పెట్టారని విద్యార్థులు తెలిపారు. 56 మంది 2లో

ఆర్వోబీ నిర్మాణంలో జాప్యం

- రైల్వే ట్రాక్‌పై కట్టడం తొలగింపునకు రాని అనుమతులు
- సైడ్ డ్రెయిన్లు, సర్వీసు రోడ్లు లేకుండా నిర్మాణం
- 3 పిల్లర్లతో మూణ్ణెల్లుగా జాప్యం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు శంకర్ విలాస్ ఆర్‌వోబి నిర్మాణంపై ఎడతెగని జాప్యం జరుగుతోంది. గత మూడు నెలల కాలంలో కేవలం రెండు వైపులా అటూ ఇటూ మూడు పిల్లర్ల నిర్మాణం సగం వరకు జరిగింది. తరువాత వర్షాలు, పండగలు, ఇతర సమస్యలతో పనులు నిలిచిపోయాయి. పనుల జాప్యంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల జరిగిన సమీక్షల్లో అధికారులు, కాంట్రాక్టరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి ఏవో సమస్యలు వస్తుంటాయి. దసరా, దీపావళి, క్రిస్మస్ ఇలా పండగలు వస్తుంటాయ్...పోతుంటాయి.. కానీ పనులు వేగంగా జరగకపోతే ఎలా అని నిలదీశారు. ఆర్‌వోబి లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రెండేళ్లలో పూర్తి చేయాల్సిన బ్రిడ్జిని ఏడాదిన్నరలోనే పూర్తి చేయాలని మంత్రి పెమ్మసాని గట్టిగా హెచ్చరించారు. పనులు ఎందుకు నెమ్మదించాయో చెప్పాలని అధికారులను నిలదీశారు. అయినా పనులింకా పునరుద్ధరణ జరగలేదు.

అటు ఎసి కళాశాల వైపు మొత్తం 11 పిల్లర్లు, అరండల్‌పేట వైపు 10 పిల్లర్లు చేపట్టాల్సి ఉండగా అరండల్‌పేట వైపు మూడు బ్రిడ్జిలు, ఎసి కళాశాల వైపు మూడు పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. రైల్వే ట్రాక్ పై ఉన్న పాత బ్రిడ్జి కట్టడం తొలగింపునకు ఇంకా అనుమతులు రాలేదు. ఈలోగా మొత్తం పిల్లర్ల పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. అయితే పిల్లర్లకు సంబంధించిన 32 ఎంఎం ఇనుప రాడ్లు గుంటూరుకు తెప్పించడంలో జాప్యం కూడా పనుల మందగమనానికి ఒక కారణంగా చెబుతున్నారు. వాస్తవంగా తొలుత సర్వీసు రోడ్లు, సైడ్ డ్రయిన్లు నిర్మించాలని అధికారులు కోరినా కాంట్రాక్టరు నేరుగా బ్రిడ్జి పనులు మొదలు పెట్టారు. మొత్తం బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తరువాత ఈ పనులు చేపడతానని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. తొలుత సైడ్ డ్రెయిన్స్, రోడ్లు నిర్మించి తరువాత బ్రిడ్జి నిర్మించాలని కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదించగా కాంట్రాక్టరు మొదట్లోనే ఈ 2లో



13న పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు

ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు - వెబ్ ఆప్షన్ల ఆమోదంతో పోస్టింగ్ ఉత్తర్వులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డిఎస్‌సి ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు పాఠశాలలో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు చేపట్టిన కౌన్సెలింగ్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. వారికి శిక్షణ పొందుతున్న కేంద్రాల్లోనే కౌన్సెలింగ్ నిర్వహించి శుక్రవారం రాత్రి కల్లా అప్పాయింట్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా సాంకేతిక సమస్యలతో ఆర్డర్ కాపీలను ఆన్‌లైన్ ద్వారా పంపుతామని శిక్షణ, కౌన్సెలింగ్ ప్రక్రియను అధికారులు ముగించారు. ఎస్‌జిటిలకు మాన్యువల్‌గా ఆప్షన్లు తీసుకోగా టిజిటి, పిజిటి, స్కూలు అసిస్టెంట్ 2లో



అదానీ కంపెనీ సిబ్బందిని అడ్డుకున్న సిపిఎం

విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడుతుండగా నిలదీత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పండరిపురం 3వ లైనులో స్మార్ట్ మీటర్ బిగించడానికి శుక్రవారం వచ్చిన అదాని కంపెనీ సిబ్బందిని అడ్డుకున్నట్లు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ తెలిపారు. ఇప్పుడైతే ఉచితం.. తర్వాత బిగించుకోవాలంటే రూ.10 వేలు అవుతుందటూ వినియోగదార్లను భయపెట్టి మీటర్ల బిగిస్తున్నారని, ఇతర పూర్తి వివరాలేమీ చెప్పడం లేదని అన్నారు. కొన్నిళ్లలో అయితే అడగకుండాకూడా పెడుతున్నారని తెలిపారు. అదానీ కంపెనీ సిబ్బంది మాటలు నమ్మి కొంతమంది మీటర్లు బిగించుకుంటున్నా వాటి గురించి తెలిశాక మంత్రి వద్దంటున్నారని, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తామంటున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ పెట్టాక విద్యుత్ అసలు వాడకున్నా రూ.160 బిల్లు వచ్చినట్లు ఒక వినియోగదారుడు వాపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అప్పుడు రూ.1.20 కోట్లని ఇప్పుడు రూ.80 లక్షలా?

జాతీయ రహదారి భూసేకరణ బాధితులకు పరిహారం కోసం ప్రజా సంఘాల నిరసన - తక్కువ ధరకు తీసుకోవాలని చూస్తే ఉద్యమిస్తామని ఇన్‌ఛార్జి ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాపట్ల జిల్లాలని చీరాల ఓడరేవు నుండి నకరికల్లు వరకు 167ఎ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం ఇవ్వాలని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతు, ప్రజా సంఘాలు శుక్రవారం నిరసన తెలిపి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ 2లో



బోధనేతర పనులను బహిష్కరిస్తున్నాం : ఫ్యాప్టో

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్టోబర్ 10 నుండి పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో ఛైర్మన్ కె.నరసింహారావు, సెక్రెటరీ జనరల్ కె.వీరాంజనేయులు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాకు ఫ్యాప్టో నాయకులు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. విజయవాడలో 7వ తేదీన జరిగిన పోరుబాట కార్యక్రమంలో ఫ్యాప్టో పిలుపు మేరకు బోధనేతర కార్యక్రమాలను



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బహిష్కరిస్తున్నామని చెప్పారు. బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తూ ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని, మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప, ఏ ఇతర 2లో

గ్రీవెన్స్ లో 26 అర్జీలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి లోని తుళ్లూరు సి ఆర్ డి ఎ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 26 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. భూములకు సంబంధించిన అర్జీలు 19, ఆఫీస్ మేనేజ్‌మెంట్ 5, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ 1, ప్లానింగ్ విభాగానికి 1 అందాయన్నారు. ఈ సందర్భంగా జి ఆర్ ఎం నోడల్ అధికారి పి జయశ్రీ మాట్లాడుతూ, రాజధానిలోని రైతులు,భూమిలేని వాళ్ళు, ఇతరులు ఇచ్చిన అర్జీలలో కొన్నింటిని పరిశీలించి పరిష్కరించడం జరిగిందని, మిగిలిన వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం గం 1 వరకు నిర్వహించే గ్రీవెన్స్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి శ్రీనివాస నాయక్,జి రవీందర్, పి.పద్మావతి,ఎం శేషిరెడ్డి,సామజిక సంక్షేమ విభాగ డి సి డి వో బొర్రా శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సిపిఎం నాయకులతో మాట్లాడుతున్న విఆర్ఒ

పేదలకు కేటాయించిన స్థలాలు చూపించాలి

ప్రజాశక్తి-గుంటూరు

బొంగరలాబీడు, వెంగయ్యనగర్, శాంతినగర్, నిరుపేదల పేట, వసంతరాయపురం ప్రాంత నిరుపేదలైన మహిళలు 2023లో నాటి ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు చూపించి, ఇల్లు కట్టించి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు కోరారు. గత ప్రభుత్వంలో వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చినా స్థలాలు మాత్రం చూపించలేదన్నారు. ఈ సమస్యపై ఆగస్టులో సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, సదరు అర్జీపై 156 వ సచివాలయంలో శుక్రవారం విచారణలో భాగంగా విఆర్ఒ సిపిఎం నాయకులు కె.శ్రీనివాసరావు, డొంకరోడ్డు ఏరియా శాఖ కార్యదర్శి జి.శంకరరావు, బాధితులతో మాట్లాడారు. కొర్నెపాడు పరిధిలో మంజూరు చేసిన భూములు కోర్టు కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. కానీ సదరు ఆర్‌టిఐ ద్వారా అందిన సమాచారం ప్రకారం కోర్టు కేసులు ఏమీ లేవని తెలిసిందన్నారు. కావున ప్రభుత్వం లబ్దిదారులను ఏదో ఒకరకంగా పక్కదారి పట్టించి కాలయాపన చేయాలని చూడటం సరికాదన్నారు. ఎంపికైన వారంతా నిరుపేదలని, కావున వారికి స్థలాలు చూపించి, ఇళ్లు కట్టి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జి పద్మజ, వై.మాధవి, ఎ.లక్ష్మి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



లీమా స్కూల్‌ను సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ పెదకాకాని సమీపంలోని లీమా డెఫ్ అండ్ డెమ్ ఆర్ స్కూల్‌ను సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అక్కడ ఉన్న వారితో మాట్లాడుతూ మానసిక వికలాంగులకు అందుతున్న ఆహార, వసతి, వైద్య, సదుపాయాలు, పెన్షన్ గురించి వివరాలు యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇతర సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అందకపోయినా చిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. మానసిక వికలాంగుల యెడల గౌరవం కలిగి ఉండాలని, వారిని కించపరచకూడదని, వారి హక్కులకు భంగం కలిగించకూడదని తెలిపారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ కట్ట కాళిదాసు, లీమా స్కూల్ ప్రిన్సిపాల్ జెడ్.నాగమణి పాల్గొన్నారు.

బోధనేతర పనులను బహిష్కరిస్తున్నాం : ఫ్యాప్టో

(మొదటి పేజీ తరువాయి)

బోధనేతర పనులనుగానీ అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడంగాని, విద్యా శక్తి, జీఎస్టీ 2.0, లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు చేపట్టబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి.కె.సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, జి.దాసు, జె.విజయానంద్, బి.ప్రసాద్, పి.బాలాజీ, షకీలా బేగం, ఎం.కోటిరెడ్డి పాల్గొన్నారు.



ఇంచార్జ్ ఆర్డీఓ రమణ కాంత్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు

అప్పుడు రూ.1.20 కోట్లని ఇప్పుడు రూ.80 లక్షలా?

(మొదటి పేజీ తరువాయి)

రామణకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గోపాలరావు మాట్లాడుతూ గతంలో ఆర్డీఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సమక్షంలో కేసానుపల్లి గ్రామ రైతులతో చర్చించారని, ఎకరాకు రూ.1.20 కోట్లు పరిహారం ప్రకటించారని, అయితే ఇప్పుడు రూ.80 లక్షలే ఇస్తామంటూ అధికారులు ప్రతిపాదించటం సరికాదని అన్నారు. రహదారి నిర్మాణంలో కేసానుపల్లికి చెందిన 45 మంది చిన్న, సన్నకారు రైతులు 120 ఎకరాలు కోల్పోతున్నారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామ సభ జరిపి, విడతల వారీగా రైతులతో చర్చించి న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు కాకుండా నామమాత్రపు ధరతో భూములు సేకరించాలని చూస్తే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పిడిఎం జిల్లా నాయకులు ఎన్.రామారావు, కౌలుసంఘం జిల్లా అధ్యక్షులు జిల్లా కె.రామారావు, రైతులు ఎస్.ప్రసన్నాంజనేయ స్వామి, పీటర్ రాజు, ప్రకాష్‌రావు, భుజంగరావు, ఆదిబాబు, ఎల్.విజయలక్ష్మి, ఎస్.అలీషా, కె.నరేంద్ర తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

13న పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు

(మొదటి పేజీ తరువాయి)

కేటగిరిల్లోని ఉపాధ్యాయులకు వెబ్‌ఆప్షన్‌ల నమోదు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు ఖాళీలు చూపలేదు. చూపిన ఖాళీల్లోనే వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి రావడంతో నూతన ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము నమోదు చేసుకున్న ఆప్షన్‌ల ప్రకారం అప్పాయింట్‌మెంట్స్ వస్తాయా మళ్లీ మారతాయా అనే అంశంపై ఉపాధ్యాయుల్లో కొంత సస్పెన్స్ నెలకొంది. కౌన్సెలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిందని శనివారంలోగా 1140 మందికి పోస్టింగ్‌లను నిర్ధారిస్తూ ఉత్తర్వులు ఆన్‌లైన్ ద్వారా వస్తాయని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు. ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో సోమవారం రిపోర్టు చేయవచ్చని చెప్పారు. నర్సరావుపేట వాగ్దేవి కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ పర్యవేక్షించారు. వారం పాటు శిక్షణ తీసుకున్న నూతన ఉపాధ్యాయులంతా నరసరావపేటలో విద్యాశాఖ అధికారులతో కలిసి గ్రూపు ఫొటోలు దిగారు.

అన్నపర్రు హాస్టల్లో కలుషితాహారం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు అస్వస్థతకు గురవగా వాంతులు, విరోచనాలతో పలువురు నీరసించి పోయారు. ఇది తెలిసిన సిబ్బంది ప్రైవేట్ వాహనంలో పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అందరికీ వైద్యం చేయడానికి అక్కడ సరైన సదుపాయాల్లేకపోవడంతో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 18 మందిని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించగా బిసి సంక్షేమ శాఖ మంత్రి సబిత శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలు, అస్వస్థతకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు స్థానికంగానే ప్రాథమిక చికిత్స అందించారని, జ్వరం ఉన్న 18 మందిని జిజిహెచ్‌కు తెచ్చారని చెప్పారు. సంక్షేమ హాస్టల్స్‌లో మౌలికసౌకర్యాలు కల్పన, నాణ్యమైన భోజనం, విద్యకు ప్రాధ్యామిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ ఆసుపత్రి వాతవరణం వల్ల విద్యార్థులు అందోళన చెందుతారని, స్థానికంగా ఉన్న ఏసీ కళ్యాణ మండపంలో ఉంచి ప్రాథమిక వైద్యం అందించామని, జ్వరం ఉన్నవారిని జిజిహెచ్‌కు తెచ్చారని తెలిపారు. విద్యార్థులకు అస్వస్థత సమాచారం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా హుటాహుటిన హాస్టల్‌కు వెళ్లారు. వైద్యసిబ్బందితో చర్యలు చేపట్టారు. విద్యార్థులకు స్థానికంగానే అన్ని సదుపాయాలతో వైద్యం అందించుటకు ఏర్పాట్లు చేశారు. తాగునీటిని పరీక్షించాలని, పారిశుధ్యం, ఆహార పదార్థాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులను వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలసాని కిరణ్ కుమార్ పరామర్శించారు. పెదనందిపాడులోని కళ్యాణమండపంలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, నాయకులు జె.రామారావు, పి.శేషగిరిరావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చికిత్స ఏర్పాట్లను తహశీల్దార్ ఎస్.హేనాప్రియ, డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరిముల్లా పర్యవేక్షించారు. టిడిపి నాయకులు నర్రా బాలకృష్ణ, రావి శివరామకృష్ణయ్య, కోడూరి రాంబాబు, వైసిపి మండల కన్వీనర్ షేక్ కాసిం పీరా తదితరులు విద్యార్థులను పరామర్శించారు.

అప్పటి నిర్లక్ష్యమే ఇప్పటి అస్వస్థత

ప్రజాశక్తి-గుంటూరు

అన్నపర్రు హాస్టల్లో విద్యార్థుల అస్వస్థతకు కారణం అధికారుల నిర్లక్ష్యమేనని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.పవన్, షేక్.సమీర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ శుక్రవారం పరామర్శించారు. ఎస ఎఫ్ఐ నాయకులు అన్నపర్రు హాస్టలను జులైలో సందర్శించారని, భోజనం, తాగు నీరు సరిగా లేదని విద్యార్థులు తెలిపారని అన్నారు. వాటర్ ట్యాంక్‌లు పాడయ్యాయని, ఆర్ఒ ప్లాంట్ పని చేయట్లేదన్నారు. ఈ సమస్యలపై అప్పట్లో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, సంబంధిత శాఖ అధికారులు పరిష్కరిస్తామని చెప్పినా చర్యలు మాత్రం లేవన్నారు. ఫిర్యాదును పరిష్కరించామని వెబ్‌సైట్‌లో చూపించుకోవటానికే అధికారులు పరిమితం అయ్యారని విమర్శించారు. నాటి నిర్లక్ష్యమే నేటి విద్యార్థుల పరిస్థితికి కారణమన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నియోజకవర్గంలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం' పోస్టర్ల శుక్రవారం నాడు స్థానిక ఎన్. ఆర్.టి సెంటర్ రోడ్డులో గల కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విడుదల రజిని మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు 45 రోజుల పాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందన్నారు. ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడేందుకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి అప్పగించాలనే కుట్రలను అడ్డుకునేందుకు ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా కొన సాగనుందన్నారు. సంతకాల సేకరణలో మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు పాల్గొనాలన్నారు.

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలిరూరల్

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఏటా బడ్జెట్ అంచనా ప్రతిపాదనలకై సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే ప్రకారం సమావేశం నిర్వహించామన్నారు. ఎంపీపీ మాటాడుతూ గత ఏడాది రూ.15.97 కోట్ల అంచనా వేయగా, ఈ ఏడాది దానిని సవరించి రూ.16.49 కోట్ల అంచనాలు సిద్ధం చేసి, సభ్యుల ఆమోదం పొందినట్లు తెలిపారు.

బ్లాక్ బెర్రీ పొగాకు సాగు నిషేదం

ప్రజాశక్తి కారంపూడి

కారంపూడి మండలంలోని రైతులు బ్లాక్ బెర్రీ పొకాగు సాగు చేయవద్దని, ప్రభుత్వం బ్లాక్ బెర్రీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించిందని మండల వ్యవసాయ శాఖ అధికారి పోట్ల నరసింహారావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 నుండి రాష్ట్రంలో బ్లాక్ బెర్రీ పొగాను నూరు శాతం నిషేధం చేయటానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. బ్లాక్ బెర్రీ పొగాకు నారును, నర్సరీలను నిషేధించటమైనదన్నారు. వైట్ బర్లీ పొగాకు సాగు చేసే రైతులు తప్పని సరిగా ఆయా సంస్థల నుండి అగ్రిమెంట్ బాండ్‌ను పొందాల్సి ఉంటుందన్నారు. రబి సీజన్లోలో ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, పెసర, మినుము లేదా చిరు ధాన్యాలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేష్ నాయక్, మండల అధికారులు, గ్రామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మాణంలో జాప్యం

(మొదటి పేజీ తరువాయి)

అంశాన్ని పట్టించుకోలేదు. దీంతో కార్పొరేషన్ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. సైడ్ డ్రెయిన్లు, ఇతర తాగునీటి, డ్రెయినేజి పైపు లైన్లు ముందుగానే భూగర్భంలో నిర్మించాలని తరువాత సర్వీసు రోడ్లు వేయాలని కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఈ అంశంపై కూడా దృష్టి సారించలేదు. 40 శాతం పనులు పూర్తయిన తరువాత పాత బ్రిడ్జిని పడగొట్టాల్సి ఉండగా ముందుగానే పడగొట్టారన్న విమర్శలు వచ్చాయి.

ఆగస్టు 9న బ్రిడ్జిని అటూ ఇటూ రెండు వైపులా కూల్చివేశారు. అటు ఎసి కళాశాల నుంచి, ఇటు అరండల్‌పేట 9వ లైను నుంచి పిల్లర్ల వర్కులు పూర్తయిన తరువాత బ్రిడ్జి పడగొట్టాలని ఇందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుందని గతంలో జరిగిన సమీక్షల్లో అధికారులు నిర్ణయించారు. ఇందుకు భిన్నంగా ఆగస్టు రెండో వారంలోనే బ్రిడ్జిని అటూ ఇటూ కూల్చేశారు. కానీ రైల్వే ట్రాక్ పై మాత్రం కూల్చడానికి పెద్ద ప్రక్రియ ఉంది. ఇందుకు కేంద్ర రైల్వే బోర్డు అనుమతి ఇవ్వాలి. 24 గంటల పాటు రైళ్లు ఆగకుండా దారి మళ్లించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. పాత కట్టడం తొలగింపు ఉన్న ప్రస్తుత రైల్వే ట్రాక్ దెబ్బతినకుండా రైల్వేశాఖ తగిన జాగ్రత్తలతో పనులు చేపట్టనున్నారు. అవసరమైన స్థలాలను భూ సేకరణ ద్వారా తీసుకుని సంబంధిత బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉండగా ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు.

సకాలంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తాం : ఎస్ఈ శ్రీనివాసమూర్తి

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేస్తామని రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు శ్రీనివాసమూర్తి తెలిపారు. రెండేళ్లలో పూర్తిచేయాలనుకున్న బ్రిడ్జిని ఏడాదిన్నరలోపే పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పిల్లర్ల నిర్మాణ పనులకు వర్షాలే ఆటంకమన్నారు.

నగరం పరిశుభ్రతకు సహకరించండి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాష రెసిడెన్షియల్ అసోసియేషన్ యజమానులతో శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బల్క్ వేస్ట్ (100 కేజీల కంటే ఎక్కువ ఘన వ్యర్థాలు ఉత్పత్తి చేసేవారు) కంపోస్ట్ (డైజెస్టర్‌తో) చేయడం ద్వారా ఘన వ్యర్థాలు తగ్గుతాయని తద్వారా నగరం శుభ్రంగా ఉంటుందని దానికి రెసిడెన్సియల్, గేటెడ్ కమ్యూనిటీ ల్లో నివసించే ప్రజలంతా సహకరించాలని కోరారు. నగర పాలక సంస్థ ను శుభ్రంగా ఉంచడానకి తామంతా ముందుకువస్తామని, వారు డైజెస్టర్ ఇన్స్టాల్ చేసుకుంటామని తెలియచేశారు. కార్యక్రమంలో, అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, వివిధ రెసిడెన్సియల్ ప్రెసిడెంట్లు సెక్రటరీలు, ఎన్విరాన్మెంటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం టిడిపి నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో రూ.2,89,294ల విలువైన చెక్కులను మంగళగిరి వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ అందజేశారు. టిడిపి నాయకులు మాదల రమేష్ బాబు, నడపన దుర్గారావు, చిట్టిబొమ్మ వెంకటేశ్వర రావు, ఉల్లంగి శ్రీనివాసరావు, కంచర్ల బద్రి, శరణు విష్ణు, కొప్పాక ఓంకార్, సాయి పాల్గొన్నారు.

Suit Summons
IN THE COURT OF THE I ADDL.CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR.
I.A.No.254/2024 in I.A.No.197/2021 in O.S.No.614/2021

Between:
Shaik Malin@ Muhammad Malin.
...Petitioner/Plaintiff
And
Shaik Mastanvali
.... Respondent/ Defendant.

To,
Shaik Mastanvali S/o. Mahaboob Saheb, R/o.D.No.1-5-12, Gujjanagundla, Guntur, Guntur Dist.

పై నెంబరు దావా లోని ఐ.ఎ. నెం.254/2024 పిటీషనులో రెస్పాండెంటు ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను మీకు ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.13-10-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

దివ్వి శ్రీనివాస రావు,
యం.అపర్ణ,
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్స్,
నగరంపాలెం, గుంటూరు,
సెల్.89777 77377

విద్యుత్ సరఫరాలో జంపింగ్

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతోనూ తప్పని కష్టాలు

నిస్సహాయతలో దాసులకాలనీ వాసులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక మండలంలోని గుండాలపాడు, బేతపూడి దాసులకాలనీ వాసుల విద్యుత్ కష్టాలు తీరడం లేదు. వాగు మార్గం గుండా వచ్చే విద్యుత్ లైన్ల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను వేడుకుంటున్న సమయంలో, తాజాగా బిగించిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కూడా వారికి కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టింది. దాదాపు 20 రోజుల కిందట కాలనీలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, దాని నుంచి ఈ రోజు గృహాలకు ఇచ్చిన కనెక్షన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా విద్యుత్ సరఫరా జంపింగ్ అవుతూ, తరచూ ఒకేసారి లో-వోల్టేజ్ లేదా హై-వోల్టేజ్ సరఫరా అవుతోంది. ఈ హై, లోవోల్టేజ్ సమస్యల వల్ల తమ ఇళ్లలోని మోటార్లు, ఫ్యాన్లు, బల్బులు మాత్రమే కాకుండా, విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు పనిచేయడం లేదని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాత విద్యుత్ లైన్ల సమస్యలతో ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్న తాము, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ నాసిరకం కనెక్షన్ల వల్ల మరొకసారి భారీ నష్టాన్ని భరించాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనెక్షన్లు సరిగా ఇవ్వలేదు. కరెంట్ ఆగి ఆగి వస్తోంది, ఒక్కోసారి చాలా తక్కువ, ఒక్కోసారి మంటలొచ్చేంత ఎక్కువ వోల్టేజ్ వస్తోంది. మా ఇంట్లో ఫ్రిజ్ పాడైపోయింది, పక్క ఇంట్లో వాళ్ల మోటారు కాలిపోయింది. ఈ ఆర్థిక నష్టాన్ని ఎవరు భరిస్తారు? మా గోడు వినేవారే లేరా?" అని దాసులకాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి, తాత్కాలిక మరమ్మతులు కాకుండా, వాగు మార్గం గుండా కాకుండా సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్ సరఫరా అందజేయాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్లను సరి చేసి స్థిరమైన విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

సినీ జగత్తులో ధ్రువతార సాలూరి రాజేశ్వరరావు

ప్రజాశక్తి - తెనాలి : సినీ ప్రపంచంలో ధ్రువతారగా సాలూరి రాజేశ్వరరావు తన ప్రస్థానాన్ని కొనసాగించారని ప్రముఖ గేయరచయిత డాక్టర్ కె.రామరాజు అన్నారు. స్థానిక వివేక మహిళ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటి ఆధ్వర్యంలో సాలూరి రాజేశ్వరరావు జయంతిని వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రవిపాటి వీర నారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ రామరాజు మాట్లాడుతూ సాలూరి సంగీత ప్రియుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఫిలిం సొసైటీ కార్యదర్శి కృష్ణ తొలుత సాలూరి చిత్రపటానికి నివాళులర్పించారు. మురళి, రాంబాబు, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - మేడికొండూరు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని యూని వర్సల్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాం డెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ బాలస్వామి అన్నారు. మండలం లోని నరసరావుపేట రోడ్డులోని యూనివర్సల్ కాలేజీ ఆఫ్ ఇంజ నీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజులుగా జరుగుతున్న భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, మై భారత్ కేంద్ర, యూనివర్సల్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పేస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు జిల్లా స్థాయి క్రీడల పోటీలు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో , రన్నింగ్ 100 మీటర్లు, షాట్‌పుట్ ఈవెంట్లు జరిగాయి. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలూ అవసరమన్నారు. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే శారీరకంగా, మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందన్నారు. డైరెక్టర్ డాక్టర్ బాల మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, ఓటమి గెలుపునకు నాంది అని తెలిపారు.వాలీబాల్, కబాడీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, పిడి సతీష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేశారు.



బహుమతులు గెలుపొందిన క్రీడాకారులు

ప్రకటన

నా క్లయింటు తుళ్లూరు దిలీప్‌కుమార్, తండ్రి : భాస్కరరావు, డోర్ నెం. 6-33, పశువుల హాస్పిటల్ దగ్గర, వెనిగండ్ల గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరుజిల్లా వారి సంజాయిసీ మేరకు తెలియజేయునది ఏమనగా... **షెడ్యూలు :** గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్ డి॥ యిలాకా వెనిగండ్ల గ్రామపంచాయతీ ఏరియాలో చేరిన వెనిగండ్ల గ్రామం తాలూకు డి॥ నెం. 69రు య.4-96 శెంట్లు మింజుమలె నాకు హక్కు కలిగి నీకు దఖలు పరిచిన చ.గ. 150.66లు స్థలమున్నూ సదరు స్థలములో నిర్మించియున్న ఆర్‌సిసి డాబా గల డోర్ నెం. 4-63రు గల అసిస్మెంటు నెం. 663రు గల ఆస్తికి హద్దులు. తూర్పు : పంచాయతీ బజారు హద్దు : అ. 24-00 లు దక్షిణం : కంచర్ల నరసమ్మ గారి తాలూకు ఆస్తి హద్దు అ. 56.06లు పడమర : తోకల వెంకటేశ్వర్లు గారి ఇంటి స్థలము హద్దు అ. 24-00 లు ఉత్తరం : మన్నెం మాల్యాద్రి గారి స్థలము హద్దు. అ. 56-06లు

ఎగువ షెడ్యూలు దాఖలా ఆస్తి Regd. Gift deed No. 3417/2025 డాక్యుమెంట్‌కు Regd. Sale Deed No. 2880/1963 డాక్యుమెంట్స్ లింక్ డాక్యుమెంట్‌గా ఉన్నది. సదరు Regd. sale deed No. 2880/1963 ఒరిజినల్ డాక్యుమెంట్ జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళుచుండగా ప్రయాణంలో జారి పోయినవి. ఎవరికైనా 2880/1963 డాక్యుమెంట్ దొరికిన యెడల ఈ దిగువ సంతకం దారుడి అడ్రస్‌కు అందజేయగలరు.

ఎగువ షెడ్యూల్ ఆస్తుల మీద నా క్లయింటు అయిన తుళ్లూరు దిలీప్‌కుమార్ S/o భాస్కరరావు AMBIT FINVEST PRIVATE LIMITED, GUNTUR BRANCH నందు రుణం (లోన్) పొందుచున్నారు. కావున సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరములు వున్న యెడల 7 (ఏడు) దినముల లోగా ఈ దిగువ సంతకందారుడి అడ్రస్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేయగలరు. లేనియెడల ఎవ్వరికి ఏ విధమైన క్లెయిమ్‌లు, అభ్యంతరములు లేవని భావించి లోన్ పొందుట జరుగును. గడువు తర్వాత ఏ విధమైన క్లెయిమ్‌లు, అభ్యంతరములు నా క్లయింటును, రుణదాతను ఏ విధమైన స్థిరపరచజాలవని యావన్మందికి తెలియజేయుచున్నాము.

నాగ వీరాంజనేయులు కోట,
న్యాయవాది
డోర్ నెం. 5-62-8, 6/19 బ్రాడీపేట,
సాయిబాబా గుడి ఎదురు, గుంటూరు.
గుంటూరు జిల్లా. ఎ.పి. - 522002.
సెల్ నెం : 94929 88811.

నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 2040/2023 ఇన్ ఓ.యస్. నెం. 806/2023

బిట్వీన్ :
Konakala Sumathi and others
.... పిటీషనర్లు / వాదులు
ఎదిరి
Pulivarthy Adam and others
... రెస్పాండెంట్లు /ప్రతివాదులు

To,
R4 : Bathula Shakunthalamma @ Tirupathamma W/o Sagar Rao, Namburu Village, Pedakakani Mandal, Guntur dist.
R5 : Gettam Varadahanam W/o Chakrapani, Chirravvuru Village, Duggirala Mandal, Guntur District.
R10 : Sankuru Ratna Kumari, W/o Mariyadasu, Harijana Colony, Undavalli Village, Tadepalli Mandal, Guntur District.

పై నెంబరు దావాలో IA 2040/2023 పిటీషనులో మీకు శ్రీ కోర్టు మరియు పోస్టు ద్వారాను నోటీసులు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది. 28-10-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషనును మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 28-10-2025

ఎం.శ్రీనాథ్‌రెడ్డి,
పిటీషనరు/ వాది తరపు అడ్వకేట్, తెనాలి.
సెల్ : 9885461238

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవం తొలిసారిగా 2012 అక్టోబర్ 11న ఐక్యరాజ్యసమితి నిర్వహించిందన్నారు. ఆనాటి నుండి అంతర్జాతీయ స్థాయిలో ఆడపిల్లల హక్కుల గురించి, సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న లింగ వివక్ష, వేధింపులు గురించి అన్ని రంగాలలో మగవారితో సమానంగా మహిళలకు సమాన అవకాశం కల్పించాలని అన్నారు. ఐద్వా జిల్లా నాయకురాలు దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన, సమాజంలో ఆడపిల్లలపై వివక్ష వేధింపుల గురించి ప్రతి ఒక్కరు తెలుసు కోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నేటి సమాజంలో ఇప్పటికీ ఆడపిల్లలు ఎదిగే క్రమంలో ఎన్నో రకాలుగా అణిచివేతకు గురవు తున్నారని అన్నారు. డిజిటల్ అసిస్టెంట్ రాధిక మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, ఆడపిల్లల మనుగడకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప, గుడ్ షెఫర్డ్ నిర్వాహకులు కే అనూష, అత్తోట పోతరాజు, పి అనిల్ కుమార్, నాగమణి, విజయలక్ష్మి, మహిళా పోలీస్ కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిస్టర్ విద్య

ఎల్వోసీ చెక్కు అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లి గ్రామానికి చెందిన బాలసాది కౌశిక్ గుణకి మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2లక్షల 50వేల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) మంజూరైంది. శుక్రవారం బాధితుని ఇంటికి వెళ్ళి చెక్కును అందజేశారు. ఎల్వోసీ చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు కౌశిక్ గుణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చెక్కు అందజేసిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు దాసరి కృష్ణ, గ్రామ పార్టీ అధ్య క్షులు వంగా నరేంద్ర,రాష్ట్ర యస్సీసెల్ నాయకులు దోప్పలపూడి జ్యోతిబసు, మౌనిక, సీత ఉన్నారు.


చెక్కును అందజేస్తున్న టిడిపి నాయకులు

వేలం ప్రకటన
IN THE COURT OF THE IV ADDL. SENIOR CIVIL JUDGE :: GUNTUR
E.P. No. 40/2023 in Dispute No. 05/2021

Between:
Margadarsi Chit Fund Pvt. Ltd. Rep. by its Senior Manager, Market Centre, Guntur ...D.Hr
And
Mr. Gangineni Ashok Kumar ...J.Dr-4

పై నెంబరు ఇ.పి.లో డిక్రీహోల్డర్‌కు రావలసిన బాకీ నిమిత్తం Mr. Gangineni Ashok Kumar, S/o. G. Pulla Rao, JDr-4కి చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి **ది.28-10-2025** తేదిన పై కోర్టు ఉత్తర్వుల మేరకు వేలం జరిపించుటకు ఉత్తర్వులు పొందియున్నారు. **ది.28-10-2025**న శ్రీ కోర్టువారి ఎదుట వేలంజరుగును. వేలంలో పాలొనదలచినవారు పై కోర్టు వారి యెదుట హాజరై వేలపు షరతులకు లోబడి పాల్గొనవచ్చునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

Doc. No.4278/2017 dated:15-06-2017 SRO, Guntur **Schedule-B for Attachment** : In the Total Extent of 800 sq.yrds, undivided unspecified an extent of 40sq.yds. in which Tejaswi Towers in which flat.No:101, in Ground floor with Double Bedroom flat at 2nd Line Sakuntala Nagar, inner Ring road, Gunter bounded by: **North:** Open space in between the above flat and 102, **South:** open to Sky. **East:**Common corridor,**West:**Open to Sky. within the above boundaries an extent of 40sq.Yrds or 1100sq.feets Double Bedroom flat, doors, doorways, furniture and fixtures Bathroom, letrin, Electricity. Deposit, wiring, common corridor, car parking, Common Borewell, common water connection, common Stair cases, common Lift, Common terrace and all easementary rights.

D.H.R. Value : Rs.25,00,000/-
Amin Value : Rs. 35,00,000/-
Market Value : Rs. 23,30,000/-
వేలం తేది:**28-10-2025**
ఫర్‌దర్ హియరింగ్ : **04-11-2025**
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

Smt. D.S.K. Kumari, Mr. K. Srinivas
Mr. K. Seetha Ramaiah, Advocates for D.Hr.,
1/5 Brodipet, Guntur.
Cell: 9603911172, 9985462688, 9989032808

బహిరంగ ప్రకటన

మా క్లయింటు శ్రీ కాటం పాపిరెడ్డి గారి కుమారుడు అంజిరెడ్డి, నివాసం డోరు నెం. 12-1467, రోడ్ నెం.17, మహానాడు, తాడేపల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని, మా క్లయింటు, శ్రీ సగ్గుర్తి మద్ది రామయ్య గారి కుమారుడు వాల్మీకి గారి వద్ద నుండి, ICICI HFC LTD వారి లోన్ సహాయంతో కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన విక్రయ దస్తావేజు నెం.4782/1991, తేది. 30/12/1991 న శ్రీ సగ్గుర్తి వాల్మీకి గారి ఆధీనంలో పోగొట్టుకున్నారని మాకు తెలియజేసినారు.

కావున సదరు ఆస్థిపై ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన తేది మొదలు (7) ఏడు దినములలోగా ఈ దిగువ తెలిపిన మా అడ్రస్ కి తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా తెలియజేయగలరు, లేని యెడల ఎవరికీ ఏ విధమైన అభ్యంతరాలు లేవని భావించును. గడువు తర్వాత వచ్చు ఏ విధమైన క్లయింలు, అభ్యంతరాలు మా క్లయింట్ ను మరియు ఋణ దాతను ఏ విధంగా స్థిరపరచజాలవని యావన్మందికి తెలియజేయుచున్నాము

షెడ్యూలు ఆస్తి వివరం:-
గుంటూరు జిల్లా, గుంటూరు జిల్లా రిజిష్టరు వారి పరిధిలోని, మంళగిరి SRO, తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామ డి. నెం. 147/1A1A, తలుపు నెం. 12-1518, 12వ బ్లాకు, పాత అసిస్మెంట్ నెం. 3417, ప్రస్తుతం అసిస్మెంట్ నెం.1143007029 గల ఎ.సి.సి రేకుల ఇల్లుగల చ.గ. 123 ఆస్తికి హద్దులు:
తూర్పు: ప్లాటు నెం. 54 దాఖలా చుంచు లక్ష్మి గారి ఆస్తి.
దక్షిణం: అ.16లు వెడల్పు గల అందరి జాయింటు రోడ్డు.
పడమర: అ.18లు వెడల్పు గల అందరి జాయింటు రోడ్డు.
ఉత్తరం: ప్లాటు నెం. 45 దాఖలా కాటం రమణారెడ్డి గారి ఆస్తి **ఇట్లు**

కె.సర్వేశ్వరరావు,
కె.అలేఖ్య,
న్యాయవాదులు,
డోర్‌నెం. 14-482, భగత్‌సింగ్ నగర్,
యన్‌టిఆర్ బస్టాప్ ప్రక్కన, యనమలకుదురు.
విజయవాడ. ఫోన్ : 95818 73334.

In The Court of The IV Addl. Junior Civil Judge : Guntur
O.S.No.1466 / 2019

Arikapudi Sri Lakshmi - Plaintiff
Vs
Thunuguntla Venkata Srinivasu alias **Thunuguntla Venkata Srinivas** - Defendant

Notice to Defendant

Thunuguntla Venkata Srinivasu alias **Thunuguntla Venkata Srinivas**
S/o Late **Radha Krishnamurthy,**
residing at Chamallamudi Village & Post, Vatticherukuru Mandal, Guntur District, Andhra Pradesh - 522017.

పై నెంబరున వాది మీ నుండి ప్రామిసరి నోటు బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా మరియు మీ తాలూకు పిటిషన్ షెడ్యూలు ఆస్తిని అటాచ్‌మెంట్ బిఫోర్‌జడ్జిమెంట్ కోరుతూ ఐ.ఎ.నెం. 1477/2019 అను పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు దావా మరియు అటాచ్‌మెంట్ పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే15-10-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.షఫి సాహెబ్, B.A., B.L.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **63009 84672**

సత్తెనపల్లి పురపాలకసంఘ కార్యాలయము
ఆసక్తి వ్యక్తీకరణ నోటీసు (EOI)

EOI నోటీసు నెం.01/2025-26 **తేది. 10.10.2025.**

సత్తెనపల్లి పురపాలకసంఘమునకు సంబంధించి 15 ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్ వాటా నిధుల క్రింద చేపట్టబోవు త్రాగునీటి సరఫరా అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు అంచనాలు, డ్రాయింగ్ మరియు టైపు డిజైన్లతో కూడిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలు (DPR) తయారుచేసి ఇచ్చుటకు ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తెలుపవలసినదిగా నిష్ణాతులైన అర్హత కలిగిన కన్సల్టెన్సీజ్ ఏజెన్సీ ల వారి నుండి సీల్డు కొటేషన్లు కోరడమైనది. సదరు ప్రతిపాదనలు 18.10.2025 తారీఖున సాయంత్రము గం.4.00 లోపు మునిసిపల్ కార్యాలయము నందు అందజేయవలెను. ఇంకనూ ఏవైనా సాంకేతిక అంశముల కొరకు పురపాలకసంఘ కార్యాలయములోని ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనరు, సత్తెనపల్లి పురపాలకసంఘము



జెడ్‌పి హైస్కూల్ ను పరిశీలిస్తున్న అధికారులు

కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు తాత్కాలిక భవనాలు పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్లకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు, తాత్కాలిక భవనం కోసం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ గదులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయాలకు చెందిన అసిస్టెంట్ కమిషనర్ బృందంతో స్థానిక తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంఇఒ ఎ.సురేష్ కలసి తాత్కాలికంగా తరగతులను నిర్వహించేందుకు తగిన సౌకర్యాలను పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి కేంద్రీయ విద్యాలయం నూతన ప్రవేశాలు జరిగే అవకాశాలు వున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ప్రధాన రహదారికి హద్దుల మార్కింగ్

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి పోలీస్‌స్టేషన్ వరకు ఆర్ అండ్ బి ఏఈఈ కంచేటి నవ్య పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు శుక్రవారం కొలతలు వేసి రోడ్డుకు ఇరువైపులా హద్దులు గుర్తించి మార్కింగ్ వేశారు. ఏఈఈ నవ్య మాట్లాడుతూ గ్రామ సెంటర్లో ప్రధాన రహదారికి (వినుకొండ- కారంపూడి రోడ్డు) ఇరువైపులా ఆక్రమణకు గురై ఇరుకుగా మారిందని, మరోవైపు వాహనాల రద్దీ పెరిగి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఆక్రమణలు తొలగించాలని జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు వచ్చిందని, ఈ మేరకు చర్యలు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో అశోక్, సర్వేయర్ కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

ప్రజాశక్తి-ఈపూరు

జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు ఈకేవైసీ చేస్తున్నట్లు డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఆయన శుక్రవారం సమీక్షించారు. ఈనెల 12 కల్లా ఉపాధి కూలీలందరికీ ఈకేవైసీ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి కూలీలకు ఆయనే స్వయంగా ఈకేవైసీ నమోదు చేశారు. పి4 సర్వేలో ఈపూరు మండలానికి 3,000 మంది లక్ష్యం కాగా వాటిలో అర్హులైన 928 మందిని ఇప్పటివరకు గుర్తించామని తెలిపారు. నీటి సంరక్షణ పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గుండేపల్లి గ్రామంలో మ్యాజిక్ సైడ్ డ్రెయిన్స్ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పుష్పరాజ్, టిఎలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



23న 199మంది లబ్ధిదార్లకు టిడ్కో ఇళ్లు

- కుటుంబంలో ఒక్కరైనా ఆ ఇంట్లో ఉండాలి
- సేల్‌డీడ్ పెండింగ్‌ను పూర్తి చేస్తాం
- లబ్ధిదార్లకు రుణాల కోసం బ్యాంకులతో సమావేశం
- టిడ్కో ఇళ్లను పరిశీలించిన పల్నాడు కలెక్టర్, ఎమ్మెల్యే



హౌసింగ్ కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 199 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని లబ్ధిదారులకు అందించేందుకు అన్ని హంగులతో సిద్ధంగా ఉన్నాయని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. ఈనెల 23న ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయనున్నామని తెలిపారు. ఈ మేరకు గృహ సముదాయాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాధీన పరుచుకున్న ఇళ్లలో లబ్ధిదారుల్లో ఎవరో ఒకరు కచ్చితంగా నివాసం ఉండాలని, లేకుంటే అసాంఘిక కార్యకలాపాలకు కాలనీలు నెలవుగా మారే అవకాశం ఉందని అన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న మరో 270 ఇళ్లకు సంబంధించి కూడా త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణాలు మంజూరవ్వని 300 మందికి పైగా లబ్ధిదారులకు బ్యాంకులతో సమావేశం ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేసి ఇళ్లు స్వాధీనం చేస్తామన్నారు. సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు ఈనెల 23లోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటికే నివాసం ఉంటున్న లబ్ధిదారుల నుంచి కాలనీలో సదుపాయాల గురించి తెలుసుకున్నారు. వీధి దీపాలు మరమ్మతులకు గురైనట్లు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ సకల సదుపాయాలతో టిడ్కో కాలనీ తీర్చిదిద్దామని, ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సుబ్బరాయ గుప్తా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ హౌసింగ్ కాలనీలో సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

నరసరావుపేట పట్టణ సమీపంలోని ఉప్పలపాడు గ్రామ పరిధిలో గల అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడున్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత దారులు బాగాలేవని, మురుగు కాల్వలు బాగు చేయించాలని, నూతన డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని కోరారు. ప్రతి వీధికి కొత్త విద్యుత్ లైన్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై సంబంధిత అధికారులను కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశించారు.

బాపనయ్య నగర్ వాసులకు ఇళ్ల పట్టాలివ్వండి

నరసరావుపేట పట్టణం బాపనయ్య నగర్‌లో 35 ఏళ్ల నుండి నివసిస్తున్న ఎస్సీలకు పూర్తి స్థాయిలో హక్కులు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.అరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.జాన్‌పాల్ కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బాపనయ్య నగర్‌లో నివసిస్తున్న వారంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే పేదలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ కాలనీ వాసులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని, వాటిని పరిశీలించి హక్కులు కల్పిస్తామని చెప్పారు.

8 గంటల పాటు పిన్నెల్లి సోదరుల విచారణ

జంట హత్యల కేసులో రూరల్ సర్కిల్ స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు



విచారణ అనంతరం పోలీస్ స్టేషన్ నుండి బయటకు వస్తున్న పిన్నెల్లి సోదరులు

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం గుల్లపాడు గ్రామంలో జరిగిన జంట హత్యల కేసులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డి స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విచారణకు రెండోసారి హాజరయ్యారు. ఉదయం 10 గంటల సమయంలో స్టేషన్‌కు రాగా సాయంత్రం 6.30 గంటల వరకు విచారణ జరిగింది. అయితే విచారణ వివరాలేవి తెలియరాలేదు. పిన్నెల్లి సోదరులు విచారణకు వస్తున్న సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుండి వైసిపి శ్రేణులు రాకుండా పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. రూరర్ సర్కిల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున పోలీసులను మోహరించారు.

కోటిసంతకాల పోస్టర్ ఆవిష్కరణ

మాచర్ల పట్టణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 'కోటి సంతకాల సేకరణ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజ్‌లను పీపీపీకి ఇచ్చే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశం మీదనే తాము కోటి సంతకాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పోలా శ్రీనివాసరావు, షేక్ జలీల్, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, చల్లా శ్రీను, బూడిద శీను, మాచర్ల నియోజకవర్గంలోని శ్రేణులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి పట్టణం రఘురాం నగర్ టిడిపి కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నిర్వహించగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలపై విన్నవించారు. ప్రొబేషన్ కాలానికి సంబంధించిన 2 నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, 9 నెలలకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని, ప్రమోషన్ లేకుండా ఒకే క్యాడర్లో ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ కింద ఒక స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. సచివాలయాల పరిధిలోని 21 డిపార్ట్మెంట్ల వారందరికి, ప్రమోషన్స్ ఇవ్వని డిపార్ట్మెంట్ వారికి 40 శాతం తగ్గకుండా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సిహెచ్.ప్రదీప్, ఎం.గౌతమి, డి.నళిని, అరుణ, రవి, రాజు, ఆర్.సురేష్, నాగలక్ష్మి, నరసింహా, అనంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

పల్నాడు డ్వాక్రా మహిళలకు రూ.5.07 కోట్లు

కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ మంజూరైనట్లు డిఆర్‌డిఎ పీడీ వెల్లడి



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ ఝాన్సీరాణి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక బలోపేతం కోసం పల్నాడు జిల్లాకు రూ.5.07 కోట్ల కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్ మంజూరైందని, డి.ఆర్.డి.ఎ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. నరసరావుపేట మండలం కోటప్పకొండ వద్ద గల జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించిన గ్రామ నిధి పోర్టల్ ద్వారా జిల్లాలోని 26 మండలాలకు మండలానికి రూ.19.50 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. గ్రామ సంఘాల్లోని స్వయం సహాయక సంఘాల వారు అవసరం మేరకు దానిని గ్రామ నిధి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని మండల సమాఖ్య ప్రతినిధులను ఆదేశించారు. జిల్లా సమాఖ్య ప్రతినిధులు స్వయం సహాయక సంఘాలకు సంబంధించి గ్రామ సంఘం అసిస్టెంట్‌లుగా మహిళలు మాత్రమే కొనసాగాలన్నారు. అనంతరం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా రజినిని ఎన్నుకున్నారు. సమావేశంలో ఏపీడీ రాజా ప్రతాప్, డిపిఎంలు మల్లీశ్వరి, శ్రీనివాస్, డేవిడ్ పాల్గొన్నారు.

ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులకు రేపు ఉచిత మెగా వైద్యశిబిరం : డాక్టర్ కొల్లి కృష్ణచైతన్య



డాక్టర్ కృష్ణచైతన్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కిమ్స్ (పూర్వ) కన్సల్టెంట్ వైద్యులు, ఎమ్‌డి పల్మనాలజీ డాక్టర్ కొల్లి కృష్ణచైతన్య కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో కెజిఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేటలోని పెద్దచెరువు 9వ లైన్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో జలుబు, దగ్గు, బిపి, షుగర్ వంటి సాధారణ వ్యాధులతో పాటు ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు, దీర్ఘకాలిక దగ్గు, కళ్లెలో రక్తం పడుట, ఆయాసం, టిబి, న్యూమోనియా, ఊపిరితిత్తుల్లో చీము, నీరు చేరుట, గురక, పిల్లి కూతలు, ఎలర్జీ, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వివరించారు. పుట్టి పెరిగిన ప్రాంత ఋణం తీర్చుకునేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పిన తన తండ్రి కొల్లి బ్రహ్మయ్య సూచన మేరకు ఎస్సీ కాలనీల్లో వైద్య శిబిరాలతో పాటు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రశ్నించే తత్వంతో ముందుకు సాగాలి : ఐద్వా

ప్రజాశక్తి - తాడేపల్లి

సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు ప్రశ్నించే తత్వంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ అన్నారు. ఉండవల్లి గ్రామ ఐద్వా మహాసభలు శుక్రవారం నిర్వహించారు. సభకు ఓలేటి శాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ఆటో నడిపే దగ్గర నుండి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళ ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇటీవల కాలంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారలను అరికట్టాలని



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ

కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాలను ప్రజలకు వద్దకు రాకుండా అడ్డుకట్ట వేయాలని కోరారు. అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై తిరగబడాలని పిలుపునిచ్చారు. మహిళలు ఐక్యంగా ఉండి, తరచుగా వచ్చే సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను పటిష్టంగా అమలుపరచుకోవటానికి, వాటిపై మనకు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అధిక ధరలు మహిళల పాలిటి శాపాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిఎస్టి తగ్గింపు సంబరాలు చేసుకోవటం ప్రభుత్వం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ధరలు ఏమాత్రం తగ్గలేదని వివరించారు. అనంతరం ఐద్వా ఉండవల్లి మహాసభ అధ్యక్ష కార్యదర్శులుగా ఓలేటి విజయలక్ష్మి, జ్యోతి, కోశాధికారిగా వల్లభాపురం భవాని, మణి, వి.లక్ష్మి, యు.లక్ష్మి ప్రియాంకతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎం హరిబాబు

పంట రుణాలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - దుగ్గిరాల : పంట రుణాలు ఇవ్వాని చిలువూరు యూనియన్ బ్యాంకు వద్ద కౌలు రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ సిసిఆర్సీ కార్డు ఉన్న ప్రతి కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రెండు లక్షలు ష్యూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలు కార్డు లేని వారికి, ఈ క్రాప్ చేసిన వారికి జె.ఎల్.జె. గ్రూపుల ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.భాను తేజ మాట్లాడుతు బాకీ లేని వారికి వెంటనే రుణాలు ఇస్తామన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం గ్రామ అధ్యక్ష కార్యదర్శులు ఎం.అంజయ్య, పఠాన్ ఇస్మాయిల్ ఖాన్, ఎన్.నాగేంద్రం, శ్రీను, దేవినేని బుజ్జి, పి.కాటమరాజు, వి.వీరయ్య, షేక్ ఆసిఫ్, జైపాల్, అగస్టిన్ పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న రవినాయుడు

కెఎల్‌యులో ప్రారంభమైన సమ్యక్ 2025

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో జాతీయ స్థాయి టెక్నో-మేనేజ్‌మెంట్ ఫెస్ట్ సమ్యక్-2025ని శుక్రవారం ఘనంగా ప్రారంభించినట్లు వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ తెలిపారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర క్రీడల అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో-వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, సమ్యక్ చైర్మన్ డాక్టర్ కె. రాజశేఖర్ రావు, డాక్టర్ ఎ. శ్రీనాథ్, డాక్టర్ మాధవ్, కన్వీనర్లు డాక్టర్ వి.రాజేష్, డాక్టర్ కఅష్ణారెడ్డి, డాక్టర్ ఎం. కిషోర్ బాబుతో పాటు ఇతర సీనియర్ నిర్వాహకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థి నాయకులు హాజరయ్యారు. రవినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు అనుకూలమైన, సరసమైన, స్కేలబుల్ పరిష్కారాలను నిర్మించాలని సూచించారు. ప్రముఖులు ఉత్సవ సావనీర్‌ను విడుదల చేశారు. అనంతరం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, వైస్ ఛాన్సలర్లు డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సమ్యక్ చైర్మన్లు కలిసి ముఖ్య అతిథి అనిమి రవినాయుడిని సత్కరించారు.


అద్భుతంగా మొదటి రోజు కార్యక్రమాలు

తొలిరోజు కార్యక్రమాలు అద్భుతంగా జరిగాయి. 23 రాష్ట్రాల నుండి 25 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాజెక్ట్ ఎక్స్ పో ఎఐ, ఎంఎల్, మొబిలిటీ, హెల్త్-టెక్, అగ్రి-టెక్, స్థిరత్వం, ఎంబెడెడ్ సిస్టమ్‌లలో 450 పైగా విద్యార్థుల ఆవిష్కరణలు ప్రదర్శనలో ఉన్నాయి. 256 పైగా ఆచరణాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సులర్ డాక్టర్ పార్ధసారధి వర్మ మాట్లాడారు. డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ కె. రాజశేఖర్, సమ్యక్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. సజావుగా నిర్వహించినందుకు భాగస్వామ్య సంస్థలు, అధ్యా పకులు, వేలాది మంది విద్యార్థి వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

అమెరికా ఆధిపత్యాన్ని నిలువరిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి - తెనాలి

దేశ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు అమెరికా ఆధిపత్యాన్ని నిలువరించాల్సిన అవసరం ఉందని సిపిఎం తెనాలి పట్టణ కమిటీ కార్యదర్శి కె.బాబుప్రసాద్ అన్నారు. స్థానిక చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ అమెరికా నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని చెప్పారు. ఆ భారాన్ని ప్రపంచ దేశాలపై వేసి ఆదేశం ఒడ్డున పడేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే మన దేశ ఎగుమతులపై సుంకం వేస్తున్నారని తెలిపారు. వాటి వల్ల మన పరిశ్రమలు మూత పడుతాయన్నారు. రూరల్ కమిటీ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ట్రంప్ విధానాలను అడ్డుకోవడంలో మన దేశం విఫలమైందని, చైనా, మెక్సికో లాంటి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

దేశాలు ఎదురు తిరిగితే వాటితో అమెరికా రాజీ పడిందన్నారు. అమెరికా నిరంకుశత్వాన్ని అడ్డుకునేందుకు ప్రజల్లో అవగాహనకు ప్రచారం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్ వలి, జి.వెంకట సుబ్బయ్య, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నవీన్‌కుమార్

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

ప్రజాశక్తి - పెదకాకాని : విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని, వ్యవస్థాపకులుగా ఎదిగి పరిశ్రమలను స్థాపించాలని, వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టి విజయవంతం కావాలని పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎమ్.నవీన్ కుమార్ అన్నారు. నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి మెకానికల్ ఇంజనీరింగ్, ఐఈఐ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ఆమేయా-2కే25 ముగింపు వేడుకలు శుక్రవారం జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎం.నవీన్‌కుమార్ హాజరయ్యారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ సదస్సులో జిగ్ టెక్, పేపర్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్, ఆర్‌సి కార్నేజ్, పిక్టో, క్రిక్ క్విజ్ వంటి సాంకేతిక పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామపంచాయతీ అధికారులకు, మండల అధికారులకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీంతో కార్మికుల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని కోరారు. కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు, సబ్బులు, నూనె, గ్లౌజులు ఇవ్వాలని కోరారు. జీతాలు 24వ తేదీల్లోపు చెల్లించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక ఒటకలో వార్డు పూలే కాలనీలో నిర్వహిస్తున్న మెయిన్ డ్రెయిన్ స్పెషల్ పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిపోయిన రాధిక శుక్రవారం పరిశీలించారు. ప్లాంటును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ప్రారంభించనున్న నేపథ్యంలో మునిసిపల్ అధికారులకు, శానిటేషన్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మువ్వా ఏసుబాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, ఇన్‌చార్జి ఎఇ జానీబాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాంటును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక



13 గంటల పని విధానం వద్దు

ప్రజాశక్తి- తాడేపల్లి

కార్మిక వర్గం రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. తాడేపల్లిలోని పారిశుధ్య కార్మికుల మచ్చర్ పాయింట్ల వద్ద శుక్రవారం మున్సిపల్ వర్కర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడాదిన్నరగా కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో సంతోషం, నాని, మేరీ, శీను, కంచర్ల అనూష, సుబ్బులు, మరియమ్మ పాల్గొన్నారు.

కెవిఆర్ జెడ్‌పి స్కూల్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక పిఎం కెవిఆర్ జెడ్పి పాఠశాలలో తుళ్లూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గుత్తా శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను, దానిపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. 'మానసిక ఆరోగ్యం విపత్తులు, అత్యవసర పరిస్థితులలో సేవల లభ్యత' అనే ఇతివృత్తం గురించి మాట్లాడుతూ మన జీవితంలో తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాలు, మన ప్రాంతంలో చోటుచేసుకున్న అనూహ్యమైన, వేగవంతమైన మార్పుల వంటివి ఎదురైనప్పుడు, మానసిక స్థైర్యాన్ని కాపాడుకోవడం ఒక సవాలుగా మారుతుందని చెప్పారు. ఇటువంటి ఆకస్మిక సంక్షోభాలు మన దైనందిన జీవితాలను అతలాకుతలం చేయడమే కాకుండా, తీవ్రమైన మానసిక ఒత్తిడికి, అనిశ్చితికి దారితీస్తాయని చెప్పారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఎదుర్కొనే మానసిక సమస్యలను ఆయన వివరించారు. భద్రతా భావాన్ని కోల్పోవడం, ఆందోళన, నిద్రలేమి, ఒంటరితనం వంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయి. ఈ మార్పులు మన సామాజిక సంబంధాలను దెబ్బతీసి, మన గుర్తింపును,



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

పాత్రను కూడా ప్రశ్నార్థకం చేస్తాయి. ఇది మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి మార్గాలున్నాయని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

జీఎస్టీపై అవగాహన

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాల ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే కన్నాలక్ష్మి నారాయణ శుక్రవారం ప్రారంభించారు. వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని జీఎస్టీ తగ్గింపుపై వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పిం చారు. ప్రజల తలసరి ఆదాయం మెరుగుపడుతుందన్నారు. సత్తెనపల్లి సిటిఒ శ్రీదేవి, ఎసిటిఒ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని లగడపాడు, కన్నెగండ్ల, గారపాడు గ్రామాల్లో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా టిడిపి కార్యదర్శి ఆర్తి మల్ల రమేష్, సీనియర్ నాయకులు బి. రాంగోపాల్రావు, బి.ఆంజనేయులు గళ్ళ బాబురావు ఎం.సత్యం, ఎం. సాగర్ ఎం.చంద్రశేఖర్ దుకా ణాలు, ఇళ్ళ వద్దకు వెళ్లి కరపత్రాలు పంచారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మండల స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండలం పాపాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి అండర్ 14, 17 ఆటల పోటీలలో నాగిరెడ్డిపాలెం గ్రామం విజడం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఎంపికలకు మండలంలోని వివిధ స్కూల్స్ నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. విజిడం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపించారు. అండర్-17 విభాగంలో కోకో 9, కబడ్డీ 7, వాలీబాల్ 4, అండర్-14 విభాగంలో కబడ్డీ 7, వాలీబాల్ జట్టు కెప్టెన్ రాము నాయక్ ఆధ్వర్యంలో విజేతలుగా నిలవగా 100 మీటర్స్‌లో జయపరావ్, లాంగ్‌జంప్‌లో అనిల్, షార్ట్‌పుట్‌లో వినయ చందు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని స్కూల్ ప్రిన్సి పాల్ పాండురంగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పిఇటి మాస్టర్ రామాంజనేయులునాయక్, తల్లిదండ్రులు విద్యార్థులు అభినందించారు.



అన్నదానం చేస్తున్న జర్నలిస్టు నాయకులు

ఎన్నారై కృష్ణ ప్రసాద్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మాచర్ల

ఎక్కడో విదేశాల్లో స్థిరపడినా, పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మర్చిపోకుండా స్నేహితుల ద్వారా ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెపి చారి అన్నారు. ఎన్ఆర్ఐ కృష్ణప్రసాద్ మనవడు వియాన్‌శేఖర్ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మాచర్ల పట్టణానికి చెందిన కృష్ణప్రసాద్ అమెరికాలో స్థిరపడినా, వారి మనవడు వియాన్ శేఖర్ పుట్టినరోజు సందర్భంగా మాచర్లలో స్నేహితుల ద్వారా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు జి. శ్రీనివాసరావు, ప్రజాశక్తి రమేష్, ఉప్పుప్రసాదు, విలేకరులు చంద్రారెడ్డి శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, వాసు, ప్రజానాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో సామాన్యులకు ఊరట

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిఎస్‌టి రేట్ల తగ్గింపుతో సామాన్యులకు ఊరట కలిగిందని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ వెల్లడించారు. శుక్రవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలు, భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త దశకు నాంది పలుకుతుందని పన్ను వ్యవస్థను సులభతరం చేయడం ద్వారా పారదర్శకత పెరుగు తుందన్నారు. ప్రజల ఆదా శక్తి పెరుగుతుందని ఈ మార్పులు పేదలకు, మధ్య తరగతికి లబ్ది చేకూరుతుందన్నారు. భారత వ్యాపారవేత్తలకు 'మేడ్‌ఇన్ ఇండియా'ని ప్రపంచానికి నాణ్యతా ప్రమాణంగా నిలబెట్టే శక్తి నిస్తాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, టీవీలు, ఎలక్ట్రానిక్స్, ఇంటికి ఉపయోగపడే గృహోపకరణాల ఉత్పత్తులు పెరుగుతాయని వివరించారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ జిఎస్‌టి 2.0తో ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల ప్రదర్శన, అమ్మకపు మేళాను ప్రారంభిస్తూ ఎయిర్ కండిషనర్లు, పెద్ద స్క్రీన్ టీవీలు, డిష్ వాషర్లు, కిచెన్ చిమ్నీలపై 28 నుండి 18 శాతానికి తగ్గినట్లు చెప్పారు. ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, ఖాదీ ఉత్పత్తులు, ఇత్తడి ఉత్పత్తులు, సోలార్ పరికరాలు, ఫుడ్ కోర్టులు, క్రీడా, జిమ్ పరికరాలు, వ్యవసాయ, ఉద్యాన వనస్టాల్స్ ఉంటాయన్నారు.

నల్లబర్లీ సాగు వద్దు

వ్యవసాయాధికారి శాంతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నల్లబర్లీ పొగాకు సాగుపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఆయా కంపెనీల ప్రతినిధుల మాటలు నమ్మి నల్లబర్లీ పొగాకు సాగు చేపట్టి రైతులు మోసపోవద్దని నరసరావుపేట మండల వ్యవసాయ అధికారి ఐ. శాంతి రైతులకు సూచించారు మండలంలోని పెద్ద రెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు ఎట్టి పరిస్థితుల్లో సాగు చేయవద్దన్నారు. తెల్లబర్లీ సాగు చేపట్టే రైతులూ కంపెనీల నుండి ముందస్తు అనుమతి ఉంటేనే సాగు చేయాలన్నారు. వాటి బదులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, మినుము, పెసర, నూగు పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ వరి పంట



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శాంతి

కు ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖరీఫ్ సాగు పంటలకు సంబంధించి పంట కోత ప్రయోగాలు చేపట్టాల్సి ఉందన్నారు. వరిలో సామూహిక ఎలుకల నివారణకు మందు పిచికారీ చేయాలని సూచించారు. ఎకరాకు 15 నుండి 20ఎలుకల బొరియలను ఏర్పాటు చేసి వాటిలో ఎరలను పెట్టి మట్టితో మూసి వేసి, మరుసటి రోజు బ్రోమోడియాలోన్ 0.25 ఎరలను ఉంచాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి కె.బ్రహ్మయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు శైలజ రైతులు పాల్గొన్నారు.

దూరవిద్య ఒకరోజు శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం వారి ఆదే శాల మేరకు ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ దూరవిద్యకు సంబంధించి ఒకరోజు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసిన వారు తిరిగి చదువును కొనసాగించడానికి దూరవిద్య విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంఈఓ 1 కృష్ణ మాట్లాడుతూ ఈ విధానం గ్రామీణ ప్రాంతాల వారికి అందులో ప్రత్యేకించి 9 మరియు 10వ తరగతి మధ్యలో చదువు మానుకున్న వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంఈఓ 2 గణేష్, మండల సమన్వయకర్త సిహెచ్ సురేష్, విషయ నిపుణుడు ఇన్నారెడ్డి, క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుగ్గి బాబురావు మాట్లాడారు. జడ్పీహెచ్ తాళ్లూరు ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ నాగవరం జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దానియేలు సచివాలయ, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్జిపై దాడి మతోన్మాదానికి నిదర్శనం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

దేశ అత్యున్నత న్యాయాధికారి జస్టిస్ గవాయిపై చెప్పులతో జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందనీ, ఇది బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల వికత మతోన్మా దానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దాడి చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోపోవటం, దేశంలో దళితుల పట్ల బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల తీరును మరోసారి స్పష్టం చేసిందన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ రెండు నాలుకల ధోరణిని మార్చుకొని, దళితుల భద్రత కొరకు సరైన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని రామచంద్రారెడ్డి అన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, దొడ్డ శ్రీనివాసరావు, కొమ్ము కోటేశ్వరరావు, షకీర్‌అలీ, నాజర్‌వలి, ఆదాం, నాయక్, బ్రహ్మారెడ్డి, గాలం అంజి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ ముప్పాళ్ళ,ఈపూరు, కొచ్చర్ల, ఊడిజర్ల విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎస్ గాంధీబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం అర్ధరాత్రి రెండు నుండి ఉదయం 9 గంటల వరకు, అనంతరం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలనికోరారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేడు రొంపిచర్ల మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఎఇ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం పిడుగురాళ్ళ 220 కెవి సబ్ స్టేషన్‌లో, రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్న పాలెం విద్యుత్ సబ్ స్టేషన్లలో 33 కెవి, 11కెవి లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9 నుండి మధ్యా హ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాల కోసం శనివారం తెల్లవారు జామున ఒకటి నుంచి ఉదయం 9 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని రెండవ శనివారం 11కెవి లైన్లో ట్రీ బ్రాంచెస్ కటింగ్, లైన్స్ మెయింటినెన్స్ ఉన్నందువలన, మాచర్ల టౌన్‌లోని 33/11కెవి సిద్ధగుంతల, 33/11 కెవి రింగ్‌రోడ్డు, 33/11కెవి రైట్ కెనాల్ సబ్ స్టేషన్లలో కరెంటు సరఫరా ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపి వేయనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓఎస్డి ఏ.రామయ్య తెలిపారు. 33 కెవిలైన్ల మరమ్మత్తులు, మెయింటినెన్స్, ట్రీ బ్రాంచెస్ కటింగ్ కోసం 33కెవి మాచర్ల మండలం అనుపు, కొప్పునూరు ఫీడర్స్ ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు, వెల్దుర్తి మండలం 132/33కెవి గుండ్లపాడు సబ్‌స్టేషన్ నుండి 33 కెవి వెల్దుర్తి ఫీడర్ను ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని తెలియజేశారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - పెదకూరపాడు

పౌష్టికాహారం అందించడమే పోషణ మాసోత్సవ లక్ష్యమని ఐసిడిఎస్ సిడిపిఓ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఊబకాయం తగ్గించటం, పుట్టిన పిల్లలకు వెయ్యి రోజులు తల్లిపాలు, పోషకాహారం గురించి ఆమె వివరించారు. తహశీల్దార్ ధనలక్ష్మి, ఎంపీడీవో సాయి లీల, ఎంఈఓ ప్రసాదరావు, సత్యనారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అత్త దేవమ్మ, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ ఎంపీటీసీ ముంతాజ్, డ్వాక్రా యానిమేటర్ కావూరు సుజాత, సూపర్వైజర్లు ఇమాంబి, మాధవి, జడ్పీహెచ్ స్కూల్ హెడ్మాస్టర్ రమణ మండల అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు ఆడపిల్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పెదకూరపాడు

గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని తాళ్లూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి మండలంలోని పణిదంలో గర్భిణీలకు పౌష్టికాహారాన్ని డాక్టర్లు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్ కన్నా కార్యాలయంలో 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 7లక్షల 6వేల 829 ల చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దరువూరి నాగేశ్వరరావు యెలినేడి రామ స్వామి పట్టణ అధ్యక్షులు మస్తాన్వలి కార్యదర్శి జాన్ బాబు చౌట శ్రీనివాసరావు రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షులు ఏ.నరసింహారావు, ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇర్లపాడులో ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - నాదెండ్ల

నరసరావుపేట డిఎల్‌పిఓ వివిఎం లక్ష్మణరావు శుక్రవారం నాదెండ్ల మండలంలోని ఇర్లపాడు గ్రామంలో పర్యటించారు. పారిశుధ్యం, చెత్త సేకరణలో ఇర్లపాడు గ్రామ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఆయన ఈ పర్యటనను చేపట్టారు. రోజు వారీ చెత్త సేకరణ కార్యక్రమ నిర్వహణపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరించే సమయంలోనే తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలని స్థానికులకు ఆయన సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన గ్రామస్థులను కోరారు. ఆయన వెంట గ్రామ సర్పంచి గొల్లప్రోలు కోటే శ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి కారసాల మధు బాబు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

బాల్య వివాహాలను అరికట్టాలని కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి తమ పాఠశాలలోని బాలికలకు, వారి తల్లితండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అమెరికన్ పౌర హక్కుల కార్యకర్త లలానార్ రూజ్వెల్ట్ జన్మదినాన్ని అంతర్జా తీయ బాలికల దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. బలవంతపు బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవలు సూపర్‌వైజర్ బి.అన్నపూర్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు అప్పా రావు, పెదయాసపు, వెంకటనారాయణ, వైద్యసిబ్బంది సుబ్బాచారి, అంగన్వాడీ సిబ్బంది గోవిందమ్మ, జ్యోతి, ధనలక్ష్మి, శాంతలత, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని కస్తూరిబా స్కూల్ నందు ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మానసిక ఆరో గ్యం- హెల్త్ డైట్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. ఈ సందర్భంగా మానసిక నిపుణురాలు మైల చందన మాట్లాడుతూ ఆరోగ్యంపై బాలికలు తీసుకోవాల్సిన జాగత్తలు, మానసికంగా దృఢంగా ఉండటం గురించి వివరించారు. మొక్కల ఆధారిత ఆహారాలు, పండ్లు, కూరగాయలు, తణధాన్యాలు, గింజలు, విత్తనాలు, చేపలు మానసిక శ్రేయస్సును ప్రోత్సహిస్తాయని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని అన్నారు. కమ్యూనికేషన్, టెక్నాలజీపై మెళకువలు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా రేట్లను నియంత్రించండి!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణ సంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం ఎక్కడో ఒక చోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయనీ, ప్రమాదాలు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం కోనసీమ జిల్లాలో జరిగిన ప్రమాదంపై కమిటీని వేయడమే కాకుండా నివేదిక ఆధారంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భానుప్రసాద్ కోరారు. చిలకలూరి పేట పట్టణంలో నేషనల్ హైవేపై ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాలలో భద్రతా నిబంధనలు అమలు జరిగేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. చిలకలూరిపేట పట్టణం బాణసంచా విక్రయాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి అని పేర్కొన్నారు. బాణసంచా విక్రయదారులు తీసుకునే లైసెన్సులు, అమ్మే సరుకుకు, వాటి రేట్లకు ఏమాత్రం పొంతన ఉండటం లేదని సంబంధిత అధికారులు స్పందించి రేట్ల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీచేస్తున్న తెలుగు మహిళలు

కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా తాడేపల్లి పట్టణం, రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు శుక్రవారం ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. 72వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నే కుసుమ, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బర్రా కఅష్ణ వందన, తాడేపల్లి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏవో సుబ్రమణ్యం

అందుబాటులో యూరియా : ఏవో

ప్రజాశక్తి - పెదనందిపాడు

యూరియా, డిఏపి గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం, శుక్రవారం రెండు రోజులులలో రైతు సేవా కేంద్రాలు, జీడిసిఎంఎస్ ల ద్వారా 198 టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. వచ్చే వారంలో డిఏపి మరియూ కాంప్లెక్స్ ఎరువులు కూడా పెదనందిపాడు మండలానికి వస్తాయని కనుక రైతులు అందరూ యూరియా గురుంచి ఆందోళన చెందవద్దు అని రైతులకు భరోసా ఇచ్చారు. వరగాని, గోగులమూడి రైతు సేవా కేంద్రాలను శుక్రవారం సందర్శించి యూరియా బస్తాలు రైతులుకు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలం పరిధిలోని రెండు సబ్ స్టేషన్లలో విద్యుత్ మరమ్మతుల పనుల కారణంగా శనివారం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ప్రత్తిపాడు విద్యుత్ ఏఈ సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దుగ్గిరాల మండలంలో

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని చిలువూరు సబ్ స్టేషన్‌కు కొత్త లైను ఏర్పాటు చేస్తున్నందున శనివారం సాయంత్రం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని చిలువూరు, కంఠంరాజు కొండూరు, మంచికలపూడి గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఫిరంగిపురం మండలంలో..

ప్రజాశక్తి - ఫిరంగిపురం

విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రధాని ప్రత్యక్ష ప్రసారానికి తరలి రండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో శనివారం ఉదయం 10:30 నిమిషాలకు ప్రధానమంత్రి కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు యార్డు సెక్రటరీ జె.వి.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజలతో కలిసి అధికారులు పని చేయాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

అధికార యంత్రాంగం ప్రజలతో కలిసి మెలిసి మండల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జబీన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు అందించడంలో అధికార యంత్రాంగం ప్రాతినిధ్యం వహించాలన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు వారి వారి శాఖల పనితీరును తెలిపారు. సొసైటీ అధ్యక్షులు పాటిబండ్ల హరిప్రసాద్ అడిగిన ప్రశ్నకు మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు సమాధానమిస్తూ ప్రస్తుతం యూరియా ఎక్కువ వాడుతున్న మాట వాస్తవమేనని యూరియాకు బదులుగా ప్రత్యామ్నాయల కోసం శాస్త్రవేత్తలు పరిశోధిస్తున్నారు అన్నారు. జల వనరు శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దుగ్గిరాల సెక్షన్ పరిధిలో కాలువల మరమ్మతుల కోసం ఏడు కోట్ల 30 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. డ్రెయినేజీ ఏఈ కిరీటి, ఈమని పిహెచ్‌సి డాక్టర్ శ్రీవల్లి, విద్యుత్ శాఖ ఏఈ గోపి, తహశీల్దార్ ఐ.సునీత



కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

మాట్లాడారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా నియమితులైన పేరుకలపూడి ఎంపీటీసీ తాళ్ల అశోక్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైనందుకు పంచాయతీ సెక్రెటరీ కె.వివేకానందను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాడ్ చైర్మన్ ఉన్న ఝాన్సీ, డిప్యూటీ ఎంపీపీలు పసుపులేటి సాయి చైతన్య, మరీదు రామయ్య, ఎంపీడీవో ఈ.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ చంద్రమోహన్, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పెదకాకాని

విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి.ఈశ్వర్ తెలిపారు. ప్రపంచ మానసిక సమస్య ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈశ్వర్ మాట్లాడుతూవిద్యార్థి దశలో తమకు ఎదురయ్యే చిన్నపాటి సమస్యలను సైతం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియచేయాలని కోరారు. దీని ద్వారా మానసిక, శారీరిక సమస్యలను సత్వర పరిష్కరించుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చు కోవాలని టీవీలు సెల్ ఫోన్ల వాడకంలో తమ అభివృద్ధికి సంబంధించిన విషయాలకు తప్ప మరొక వాటికి చోటు ఇవ్వకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కవితా సంపుటి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని కన్వీనర్ జి.ధనుంజయరావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా సామాజిక అవగాహనతో నిరంతరం కవితా సేద్యం చేస్తున్న గోలి మధు రచించిన ఎదురీత కవితా సంపుటి, మరో పుస్తకం సాహితీ విమర్శకులు ఎ. రజాహుస్సేన్ కాఫీ విత్ గోలి మధు కవిత్వ విశ్లేషణతో ముద్రించిన పుస్తకం ఆవిష్కరణ జరుగుతాయని తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు, కళాభిమానులు, కలలను సాహిత్యాన్ని ప్రోత్సహించే అందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మానవ వికాస మండలి అధ్యక్షులు రేఖాకృష్ణార్జునరావు, ఆంధ్ర నాట కళా



కవితా సంపుటి పుస్తకావిష్కరణ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంగళగిరి సాహితీ కళావేదిక నాయకులు

సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వశాంతి కళాపరిషత్తు అధ్యక్షులు పొట్లాబత్తుని లక్ష్మణరావు, ఆకురాతి శంకర్రావు, అల్లక తాతారావు, సందుపట్ల భూపతి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవళపేట గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ గురువారం ఫిరంగిపురం శాంతిపేట సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యనమాల ప్రకాష్, ఫిరంగిపురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుల్లగూర సీతారామరాజు నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ "విగ్రహ ధ్వంసానికి పాల్పడిన గోవిందయ్యను, పోలీసులు అరెస్టు చేసినప్పటికీ, దీని వెనుక ఉన్న వ్యక్తులను కూడా తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే రాష్ట్ర ప్రజలు సహించరని హెచ్చరించారు. ఫిరంగిపురం మండల ఎస్సీ



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సెల్ అధ్యక్షుడు పుల్లగూర సీతారామరాజు, మండల కార్యదర్శి సతీష్, ఫిరంగిపురం టిడిపి టౌన్ అధ్యక్షుడు కటికల అప్పారావు, తురకా ప్రసాద్, పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యనిర్వహ కార్యదర్శి తెనాలి రాజు, గుడిపూడి వేంళగిరాజు, నూతలపాటి ఫ్రాన్సిస్, 10వ వార్డు నెంబర్ ఎస్.కె.రబ్బాని, బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి

నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డి.వేమారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం హయాంలో ఆరోగ్యశ్రీ సేవలను నిరంతరం పేద ప్రజలకు అందించడం జరిగిందని అన్నారు. తాగునీరు సక్రమంగా అందడం లేదని అన్నారు. నకిలీ మద్యం దొరుకుతుందని విమర్శించారు.

ఓడిఎఫ్ పట్టణంగా మంగళగిరి

ప్రజాశక్తి మంగళగిరి

పట్టణాన్ని తాత్కాలికంగా బహిరంగ మలవిసర్జన రహిత (ఓడిఎఫ్) ప్రకటించినట్లు కమిషనర్ అలీం బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో సర్వే నిర్వహించారు. తాత్కాలిక స్థితిని శాశ్వతంగా ధృవీకరించినట్లు, తుది ధృవీకరణ ప్రక్రియను సులభతరం చేయుటకు, ప్రజా పరిశీలన కొరకు ప్రజల నుండి దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే కార్యాలయానికి తెలియజేసేందుకు నోటీసు పెట్టామని తెలిపారు. కానీ ఈనెల 8వ తేదీ వరకు నగర ప్రజల నుండి ఎటువంటి ఉల్లంఘనలు/ ఫిర్యాదులు అందలేదని తెలిపారు. నగర పాలక సంస్థ ప్రస్తుత చట్టాలు నిబంధనల ప్రకారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థను అధికారికంగా శాశ్వతంగా బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా పకటిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ విజయవంతమైన సాధనలో భాగస్వాములై సహకరించిన ప్రతి పౌరునికి, నగరపాలక సంస్థ తరపున కృతజ్ఞతలు తెలిపారు.



అభివృద్ధి పనుల ఎస్టిమేషన్లు, ప్లాన్లను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

అభివృద్ధి పనుల ప్లాన్ల పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరిగే వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన ప్లాన్లను, ఎస్టిమేషన్లను శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు సందర్శించారు. అభివృద్ధి పనుల ప్లాన్లను, ఎస్టిమేషన్లపై అధికారులు తగు సూచనలు సలహాలు చేశారు. త్వరితగతిన ఎస్టిమేషన్లను, ప్లాన్లను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామమోహన్, ఇంజనీరింగ్ అధికారులు పరమేశ్వర రావు, శ్రీనివాసరావు, మాధవ రెడ్డి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిఆర్‌సి అమలు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రభుత్వ అధికారులకు గ్రామాల్లోని ప్రజలకు వారధిగా పనిచేస్తున్న వీఆర్‌ఏలకు ప్రభుత్వం పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని వీఆర్‌ఏల సంఘం తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షులు వేముల దుర్గారావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికి తహశీల్దార్ డి.సీతారామయ్యకు వీఆర్‌ఏలు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ నామినీలను, వీఆర్‌ఏలుగా గుర్తించాలని, ప్రమోషన్స్ డిఏతో కూడిన జీతం తదితర డిమాండ్ల అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొక్క సాంబశివరావు, షేక్ సుభాని, నామతోటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు తగ్గించాలి

ప్రజాశక్తి - కొల్లిపర

ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించేందుకు ప్రభుత్వానికి వినతి పత్రం ఇచ్చి రేపటి నుంచి బోధ నేతల పనులన్నింటినీ బాయికాట్ చేసేందుకు నిర్ణయించుకు న్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ఫ్యాక్టో తరపున ఉపాధ్యాయులు కాలేషా, ప్రతాప్, ఎస్.రామచంద్రయ్య, రమేష్, మృత్యుంజయరావు, రాము, ఏడుకొండలు, నరసింహారావు, సురేష్ పాల్గొన్నారు.

వర్సిటీ నూతన విసిగా ఎస్‌విఎస్ రాజు



16వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నూతన ఉపకులపతిగా నియమితులైన ఆచార్య సమంత పూడి వెంకట సత్యనారాయణ రాజు ఈ నెల 16వ తేదీ తర్వాత బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆయన బాండా అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీలో విసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సెంట్రల్ ఇన్స్పెక్షన్ టీం వర్సిటీని సందర్శించగా ఆ టీం తో పరిశీలనలో బిజీగా ఉన్నారు. అనంతరం బాండా యూనివర్సిటీలో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటారు. ఆ తర్వాత రాజీనామాను సమర్పించి 16 వ తేదీ అనంతరం నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్‌గా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు వీసీగా బాధ్యతలు ఎప్పుడు చేపడతారనే అంశం ఉత్కంఠ గా, చర్చనీయాంశముగా ఉండగా వాటికి నేటితో తెరపడింది.



నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు, నాయకులు

మహదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగం నుండి తొలగించిన తపాలా ఉద్యమం జాతీయ నాయకుడు మహాదేవయ్యను వెంటనే తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, పోస్టల్ సంఘాల పిలుపు మేరకు గుంటూరులోని పోస్టల్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమం కోసం నియమించిన కమలేష్‌చంద్ర కమిటీ ఇచ్చిన సానుకూల సిఫార్సులను అమలు చేయని కారణంగా మహదేవయ్య నాయకత్వంలోని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో తక్షణమే కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సుల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 2023 డిసెంబర్‌లో నాలుగు రోజులపాటు సమ్మె నిర్వహించటం జరిగిందని, ఉన్నతాధికారుల హామీ అనంతరం సమ్మె నిలిపివేయటం జరిగిందన్నారు. సమ్మెకు నాయకత్వం వహించినందుకుగాను మహదేవయ్యపై చార్జిషీటు దాఖలు చేసి, కక్షపూరితంగా ఈనెల 8న ఉద్యోగం నుండి తొలగించటం దుర్మార్గం అన్నారు. గుంటూరులోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఎఐజిడిఎస్‌యు జాతీయ నాయకులు ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఎన్.వి.రాఘవేంద్ర, శేషిరెడ్డి, ఇతర పోస్టల్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ర్యాంప్‌లు, ఆక్రమణలను తొలగించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో డ్రైన్లపై ఆక్రమణలను, ర్యాంప్‌లను తొలగించిన ప్రాంతాల్లో సమగ్రంగా పూడికతీత చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ బందావన్ గార్డెన్స్, రాజేంద్రనగర్, చాకలిగుంట, శశాంక్ గోయల్ కాలనీ, బాలాజీ నగర్ టీచర్స్, కాలనీ ప్రాంతాల్లో పర్యటించి, అభివద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్లలోకి వర్షంనీరు వెళ్లడానికి వెళ్లకుండా నిర్మాణం చేసిన ఆక్రమణలను, ర్యాంపులను దశలవారీగా తొలగిస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులు పూడికతీత పనులు చేపట్టి, అవసరమైతే నూతన డ్రైన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తొలగించిన పూడిక వ్యర్థాలను వెంటనే తరలించాలన్నారు. శశాంక్ గోయల్ కాలనీలో అనుమతించిన ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణం చేస్తున్న భవనాన్ని పరిశీలించి తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. బాలాజీ నగర్ టీచర్స్ కాలనీలో అభివద్ధి పనులు, పారిశుధ్యం పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో రోడ్ ఆక్రమణలు తొలగించక పోవడంపై పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించి, ప్రతి సచివాలయం పరిధిలో ముఖ్యంగా డ్రైన్, ప్రధాన రోడ్ల ఆక్రమణల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి రెహ్మాన్, డిఈఈ కళ్యాణరావు, ఎస్.ఎస్. ఆయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పులపై రాజకీయ పార్టీలతో సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అమలు కు చర్యలు తీసుకుంటామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఈఆర్ఓ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 1200 ఓటర్లు మించిన పోలింగ్ కేంద్రాలకు, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి సూచనలు తీసుకున్నామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిఎంసి డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, టిడిపి ఎన్.ఓంకార్, బిజెపి హెచ్.రామకృష్ణ, వైసిపి డి.జాన్‌బాబు, బిఎస్పీ సిహెచ్.వాసు, కాంగ్రెస్ బి.వాసు, ఆప్ డాక్టర్ టి.సేవాకుమార్, సిపిఎం షేక్.ఖాసిం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రహదారి ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలసి జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి ప్రక్కన వ్యర్థాలు పడేయకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రహదారులపై ప్రమాదాల మూల కారణాలు తెలుసుకొని పరిష్కరించేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ రూపొందించిన ఐ-ఆర్ఏడీ యాప్ లో రవాణా, పోలీస్, రహదారులు, వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రమాదాల వివరాలను, తనిఖీ నివేదికలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. దీనిని విశ్లేషించి రహదారులపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించటంతో పాటు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రహదారులపై స్పీడ్ బ్రేకర్లు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం స్కూల్, హస్పిటల్‌జోన్లు, బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. అలాగే నగరంలోని మూడు వంతెనల వద్ద, కంకరగుంట ఆర్‌యూబీ వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా 20 హెచ్‌పి మోటార్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని పంపించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నగరంలోని ప్రదాన రహదారులపై వాహనల పార్కింగ్ కు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై వాహన ప్రమాదాలకు అవకాశం ఉన్న 52 బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగిందని , వీటిలో ఇప్పటికే 45 చోట్ల అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన ఏడు ప్రదేశాలలో చేపడుతున్న చర్యలపై నివేదిక అందజేయాలని పోలీసు శాఖాధికారులకు తెలిపారు. సమావేశంలో డిఆర్ఓ ఖాజావలి, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీనివాస మూర్తి, జిల్లా ఉపరవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన పబ్బరాజుకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు



సంతోష్‌కుమార్ రుంగ్టాను, కె అనూషను సత్కరిస్తున్న లక్ష్మణరెడ్డి, లక్ష్మణరావు, ట్రస్ట్ ప్రతినిధులు

పబ్బరాజు వేంకటేశ్వరరావు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి 1993లో ఉద్యోగ విరమణ తర్వాత అంధుల జీవితాల్లో మార్పులు తేవడానికి శ్రీషిర్డీసాయి దీనజన సేవా సమితిని స్థాపించి వందలాది అంధ విద్యార్థులకు విద్యను అందించిన మహ నీయులు అని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కొనియాడారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో పబ్బరాజు వెంకకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానవ సేవా జాతీయ పురస్కారాలను అందించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ పబ్బ రాజు వెంకటేశ్వరరావు ఆయన సతీమణి రాజ్యలక్ష్మి సహకారంతో వందలాది అంధులను పట్టభద్రులుగా తీర్చిదిద్దారని, వారిలో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యా యులుగా, బ్యాంక్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు పొందారని వివరించారు. లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వరరావు మరణానంతరం ట్రస్ట్ ఏర్పాటు చేసి, అంధులు, వికలాంగులు, అనాధల సేవలో నిమగ్నమైన వ్యక్తులకు ఒక పురస్కారం, ఉన్నత విద్యను అభ్యసించి అత్యు త్తమ స్థాయికి చేరుకున్న దివ్యాంగులకు మరొక పురస్కారం ప్రతి ఏటా అందించడం అభినందనీయమన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయ వాది, ప్రపంచ అంధుల సంఘం అధ్యక్షులు సంతోష్ కుమార్ రుంగ్టాకు అవార్డు ఇవ్వటం ముదావహం అన్నారు. సంతోష్ కుమార్ కృషితోనే 2016లో పార్లమెంట్ దివ్యాంగుల చట్టాన్ని ఆమోదించి అమల్లోకి తెచ్చిందన్నారు. అదే విధంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో జాతీయ స్థాయిలో మొదటి పి.హెచ్.డి పొంది తొలి దివ్యాంగునిగా ప్రసిద్ధిగాంచిన ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణకు పురస్కారం అందించినట్లు చెప్పారు. అనంరతం వీరు ఇరువురికి రూ.1 లక్ష నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రం అందించి సత్కరించారు. చల్లా భాస్కరరత్నం వికలాంగ పురస్కారంను విద్యారంగంలో సేవలందిస్తున్న కె. అనూషకు అందించారు.కార్యక్రమంలో శ్రీషిర్డీ సాయి దీనజన సేవాసమితి అధ్యక్షులు ఏ.పూర్ణచంద్రరావు ట్రస్ట్ సభ్యులు యు. మధుసూదన్‌రావు, వి.పాండు రంగారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రంగయ్య, వివిఎస్ మూర్తి తదితరులు ప్రసంగించారు.

13న విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల చలో విజయవాడ

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న వీరాంజనేయులు

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 13న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ పవర్ జేఏసీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎం.వీరాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను డిపార్ట్మెంట్‌లో విలీనం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు ఇవ్వాలని కోరారు. ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎస్.కె సుభాని మాట్లాడుతూ జేఎల్ఎం గ్రేడ్ 2లకు ఏపీఎస్సీబీ సర్వీసు రూల్స్ వర్తించాలని, ప్రమోషన్లు కల్పించాలని కోరారు. జిల్లా కన్వీనర్ కె.విజయ్‌కష్ణ మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రికి, ప్రభుత్వ పెద్దలకు, యాజమాన్యమునకు పలుదఫాలుగా వినతి పత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత్యంతరంలేని పరిస్థితిలో రాష్ట్ర కమిటీలో చర్చించి 13న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అప్పటకీ సమస్యలు పరిష్కారం కాకపోతే 15వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేస్తామని, భవిష్యత్తులో విద్యుత్ అంతరాయం ఏర్పడితే మా బాధ్యత కాదని తెలియజేశారు.సమావేశంలో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు పి. శ్రీనివాసరావు, ఏ.రాజేంద్రప్రసాద్, రవి, సందీప్, గణపతి, భాస్కర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

13న సిఆర్‌డిఎ కార్యాలయం ప్రారంభం

రాయపూడిలో ఏర్పాట్లను పరిశీలించిన ఎ.భార్గవ్ తేజ



నిర్మాణంలో ఉన్న సిఆర్‌డిఎ కార్యాయలం

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరా వతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి వద్ద సిఆర్‌డిఎ ప్రాజెక్ట్ కార్యాలయం ఈ నెల 13న ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాల యాన్ని ప్రారంభిస్తారు. వ్యవధి తక్కువగా ఉండడంతో విశాఖ పట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. ఫ్లోరింగ్ తదితర పనులు ముమ్మరంగా సాగు తున్నాయి. 3.07 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ 257 కోట్ల వ్యయంతో జి ప్లస్ 7 అంతస్తులతో కార్యాలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం విజయ వాడ నుంచి సిఆర్‌డిఎ కార్యకలా పాలు జరుగుతున్నాయి. భవనం ప్రారంభించాక అమరావతి నుంచే పనులు జరుగుతాయి. పురపాలక శాఖ, సిఆర్‌డిఎ కమిషనర్ ఛాంబర్‌లు, పరిపాలన విభాగం, అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎడిసిఎల్) కార్యాల యం, తదితర విభాగాలు ఇందులో ఉంటాయి. శుక్రవారం సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ ఎ భార్గవ్ తేజ సిఆర్‌డిఎ ప్రాజెక్ట్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. సి ఆర్ డి ఎ హౌసింగ్, బిల్డింగ్స్ విభాగ చీఫ్ ఇంజినీర్ పి వి కె భాస్కర్, డెవలప్మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరెక్టర్ కె దివ్యలత, కమ్యూనికేషన్స్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ ఎం సిద్దార్థ వర్మ తదితరులు ఏర్పాట్లు గురించి వివరించారు. ప్రాజెక్టు కార్యాల యంలో విధు లు నిర్వహి స్తున్న అధికారులు, సిబ్బం దికి అడిషనల్ కమిషనర్ పలు సూచనలు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న భార్గవ్ తేజ్